# "యారాలు చిన్నది గని పాలు చిన్నదా"

ఊళ్ళళ్ళ కొన్ని పంచాయితులు గమ్మతుగ జరుగుతయి. ఎంతకు తెగయి. ఒగడు కాలుకు వెడితె ఇంకొగడు మెడకు వెడుతడు. కొన్నిసార్ల కోర్టులపొంటి తిరుగుతరు.......తగాద భూమికంటెక్కోనే ఖర్సయినా పౌరుషాలైతె విడువరు. కులాలవారిగ అడుక్కొనెటోల్లు గూడ నూర్లకు నూర్లు దండుగలు గడ్తరు. కల్లు లొట్లు ఖాళీ జేత్తరు. కొన్ని పంచాయితీలేమొ ఆచారాలనుబట్టి జరుగుతయి.

పోసయ్య కాపఘునె. అయినెకు నల్గురు కొడుకులు. అందరికీ లగ్గాలయినయి. ముప్పయారు జుట్లు కల్సుంటయి గని మూడు శిగెలు కలువయన్నది నిజమని నేననుకోను గని సానమంది కోడండ్లచ్చినంక ఏర్లువడుతరు. ఏరు వడితెనే మేలు మొగడా అన్న పాట గందుకే అచ్చిందేమొ. యారాల్ల నడుమ సిటపాటలు, ఆడోల్లు-మొగోల్ల సెవులల్ల పోరువెట్టుడు సూసి పోసయ్య కొడుకులనేరువడుమన్నడు. తనే భూమి పాల్గు పెట్టి పట్టుకొమ్మన్నడు. కొడుకులినకుంటె ఇగ కులంల వడక తప్పలే. పోసయ్యింటి ముంగట్నె పంచాయితైతంది.

"ఏం నంగతో సెప్పు పోసయ్య! నోట్ల మాట పడకుంట ఏరువడాలె గని గిట్ల మందిలవడుతరా? మీ దాంట్ల మీరే తెంపుకునేదుండె" అన్నడు కులపెద్ద

"గట్లనే మా సూసిన గని ఒగడు ఎడ్డెమంటె ఇంకొగడు తెడ్డెమనవట్టె. సెప్పుతె ఇంటలేకపోయిరి. వాళ్ళందామన్నా గని ఆడోల్లిననిచ్చెటట్టున్నరా? అంత ఆడోల్ల సేతుల్ల బతుకులాయె" అన్నడు పోసయ్య.

"అబ్బో యీనే సంపాయిచ్చి పెట్టిండంట అప్పకండెడు......" ఇగ మేం సాగనిత్తలేమట. కుప్పకుంటెక్కో అప్పె సూపవడ్తివి గద" అంది రొండోకోడలు.

"నీకు పెద్దయినెమీన గంత పక్షపాతమెందుకు. గయినొక్కడే నీ కొడుకా? జేష్ఠ పాలుకింద మంచి పాలమిత్తననవడ్తివి" అంది మూడో కోడలు.

"ఇగ గిట్లున్నదే ఎవారం" నలుగుట్ల వడకుంటె గిది తెగుతదా సెప్పు" కులపెద్దతోని రెండో కోడల్దిక్కు సూసుకుంట "ఇగో గీ రెక్కలతోనె మీ మొగలసాది పెంచిన. అందరిలెక్క తాగి, తిని దుబార జెయ్యలే. ఏదన్న పండుగత్తె, ఎవ్వలన్న సుట్టమత్తె గానాడె తాల్లల్లకు పెయిన గని ఇగెప్పుడు తాల్ల మొకం సూల్లే. నాకు సాతనయిన కాడికి సంపాయించిన. ఇగ మీరు మీ పాల్లగండ్లకు నూర్లకొద్దెకురాలు సంపాయిచ్చుకోండ్రి. నేనేమన్న వద్దంటన్ననా? నాకు మీది బుక్కెడు బువ్వ గూడద్దు. సరెనా బిడ్డ" అన్నడు పోసయ్య.

"గిప్పుడు గవన్నెందుగ్గని అసలు సంగజ్జెప్పు" అన్నడో పెద్ద మనిషి.

"ఒగలు చెప్పేదేందిర్రా! అంటె ఇనకపొయిరి. నాకున్న బూమినయిదు పాలు సేసిన. పాలుకు

మూడెకరాలత్తంది. మనిషికోపాలు పట్టుకోమ్మన్న. లేకుంటె సిట్టిలేసి తీత్తామన్న. అల్లకు పొంగ మిగిలిందే నాకన్న. ఇగ గిండ్ల తప్పేడుందో సెప్పుండ్రి....నాకు పాలియ్యరట" అన్నడు పోసయ్య.

"గీ ముసలోల్లకెందుకు సమానంగ పాలు మేం జూడమా ఏంది?" అంది రుసరుసలాడుకుంట రొండోకోడలు.

"ఇగ నువ్వు వెడితె గుండిగెల్లాకత్తది" అని కోడల్తోని కారెడ్డంగని.

"గా ఆడిపోరగాండ్లిద్దరుండిరి. గాల్లు పండుక్కో, పబ్బానికో ఇంటికచ్చిరి. గాల్లకు యాడిదికో సీరపేగన్న పెట్టన్నా? గవ్వి గీల్లను పెట్టమంటె పెడుతరా? అవ్వయ్య బతికున్నవరకే అల్లకవ్వగారిల్లు. ఉన్నదంతలసేతుల్ల వెట్టి ఇంటింటికి బువ్వెయ్యుండ్రని తిరుగన్నా? కొడుకులట పుట్టిండ్రు కొడుకులు! పెండ్లాలాడితె ఆడుతండ్రు" అన్నడు కోపంగ పోసయ్య.

"మీ నాయిన్న సెప్పిందాంట్ల తప్పేడుంది? ముసలోల్లు ఉన్నన్ని దినాలింత బూముండనియ్యుండ్రి. ఎందుకేగిర్త పడుతరు" అన్నడో పెద్దమనిషి.

"అద్దు అది గూడ పంచుకోవాలె. మేమే తలో నెల సాత్తం" అన్నడు సిన్నకొడుకు. పెండ్లాం దానికి వంత పాడింది.

"ఉన్నదంతిచ్చి నెలకో ఇల్లు ఏడిండ్ల పిల్లికూనోలె తిరుగన్నార. ముసలోనికి పాలుంటది. గిదాన్నెవ్వలు కాదనద్దు" గద్దరించినట్టన్నడు కులపెద్ద.

పెద్దోడు తప్ప మిగుతోల్లంత గులుక్కుంటనే దాని కొప్పుకున్నరు.

"గదిపోతె మానాయెగని ఉన్న ఐదుకుంచాలలుకుడు(25 కుంటలు) కార్జెమసోంటి పొలం జ్యేష్టపాలు కిందికని పెద్దయినెకిత్తె ఇగ మన్నుంటదా? ఈనె సంపాయించిండు నూర్లెకు రాలని జ్యేష్టపాలట" అంది చిన్న కోడలు.

"బువ్వవెట్టే కోడలెట్ల మాట్లాడ్తందో సూడుండ్రి. గా పెద్దోడు సగం ముసలోడయిండు. నీ మొగన్ని వాని సేతుల్లనే పెంచిండు. ఆని రగుతమంత ఇగో గీ కొంపకె దారవోసిండు. ఆని బిడ్డ లగ్గానికెదిగింది. గిప్పుడు మీరు రగుతం మీదున్నరు. సగానికెక్కో బతుకును మీ కోసురం కర్సు సేసినోనికి జ్యేష్టపాలన్నియ్యద్దంటవుగాదె బిడ్డ. ఎంత మంచవ్వవే నువ్వు! నేనేమన్న పద్ధతి తప్పిఇత్తనంటన్ననా?" కారెడ్డమాడిండు పోసయ్య.

"ఆడోల్లు నోరు మూసుకోనుండుండ్రి. ముసలోడన్న దాంట్ల తప్పేం లేదు. జ్యేష్ట పాలందరిచ్చేదే. గిదాన్ని వద్దన్నోడు దండుగ గట్టాలె!" అన్నడో పెద్దమనిషి.

"ఇగ అన్ని నాయిన్న సెప్పినట్లే అయినంక గీ పంచాయితెందుకు?" అన్నడు రొండోకొడుకు.

"నాయంగుంటె ఎవ్వలెప్పినా ఒక్కటె. గా ఐదు కుంచాలలుకుడు జ్యేష్టపాలుకిచ్చుడు న్యాయమే"

"బోల్లు బోస్కర[67] ఎవ్వలత్తగారిచ్చిన యాల్లకియ్యి. బంగారం, వరదక్షిణ ఎవ్వలదాల్లకు సూపు. ఇగ బంగారమేమన్నుంటె సమానంగ పంచియ్యి" పోసయ్యతో నన్నడు కులపెద్ద.

"వాల్లు తులాలుంటె తలో తులం ఇడుపంకె ఇచ్చిన. ఇగిచ్చుటానికేం లేదు" అన్నడు పోసయ్య

"మరత్త మీనున్న బంగారమో!" అంది మూడో కోడలు.

"నేను సావకముందే తీసియ్యన్నామె. అయినా గని గిదెవ్వలకియ్య. నా బిడ్లకే ఇత్త. నేం జత్తె ఏడ్సుటానికన్న గిదియ్యలె గద. ఉన్నదే మూడు తులాలు. చెరో తులంనరత్తది" అంది పోసయ్య పెండ్లాం.

ముసల్ది కుక్కిలవడితె ముడ్డి గడిగెత్తిపోసుడు బిడ్డలే సేత్తరు. గంధుకోసురమదాల్లకే పోతది. ఎవ్వలరుసుకుంటాల్లకే అది" అన్నరు పెద్ద మనుషులు.

"అన్ని మంచిగనే సేసిండు పోసాలు. మందిలెందుకు వడ్డట్టు మరి. ఎడ్లకు, ఇంటికి దర గట్టి తీసుకోండ్రి మరి..........మరిగ అప్పులేమున్నయో సెప్పుండ్రి".

"పన్నెండు వేలుంది. మనిషికి మూడువేలత్తది......."

"గదెవ్వలకోసురం జేసినవ్?" చిన్న కోడలంది.

"గదాని సంగతి మాకెరుకలే" మూడో కోడుకన్నడు.

"గిది మీకేడెర్కుంటదిర. ఉన్నది దొబ్బుడు తెలుత్తది గని బాకీల సంగతి తెలువది. గా ఆడిపోరగాండ్ల లగ్గాలెట్ల జేసిన? గింత సంసారం ఒక్క మడిసెక్కన్న అమ్మకుంట ఎట్లెల్లదీత్తన్న? కొడుకులు పుట్టిండ్రు బంగారి కొడుకులు. కుక్కిలవడితె గంజిబొట్టన్న పోసెటట్టులేరు" అని కొడుకులందర్ని వరుసబెట్టి తిట్టిండు పోసయ్య.

బాకి గురించి కొంత లొల్లయింది. అప్పు కుప్పలన్నిట్ని సమానంగ పంచి ఎవ్వల్దాల్ల కప్పజెప్పిండ్రు.

"ఏం పంచాయితుల్జేత్తండ్రే నీ యవ్వ! నాకు నలుపయేండ్లకచ్చె గిన్నొద్దులు గీ సంసారం కోసురమే కష్టపడితి. తమ్ముల్లంత నా వోల్లే అనుకుంటి. కని జ్యేష్టపాలిచ్చుటానికేడ్సిరి తమ్ములు. గా ఇరువయేండ్ల తమ్మునికున్ను, గంతెత్తు బిడ్డున్న నాకు ఇయ్యాల్ల ఒక్కింత బూమే రావట్టె. నా రగుతముడిగె. నేనెట్ల బతుకన్నో సెప్పుండ్రి" అన్నడు పెద్ద కొడుకు.

"గది నిజమేరా! కని అయ్యకడుపుల పుట్టినోల్లందరికి సమానంగ పంచియ్యాలె. యారాలు చిన్నదయితె పాలు చిన్నదా? చెప్పు! ఇంటికి పెద్దోడయి పుట్టినందుకు, ఇంటికోసురం సెయ్యకతప్పది బిడ్డ. అందరు కల్సిమెల్సి బతుకుండ్రి" అన్నరు పెద్ద మనుషులు.

పంచాయతంతా విన్న నాకు గ్రామీణ జీవితంలో ఏదో బంధంలాంటి దున్నట్టు కనవడ్డది. ఆ బంధాలే వాళ్లను కలిపి ఉంచుతున్నట్టనిపించింది. అయితే ఆ బంధాలకు దెబ్బ తలుగుతున్న జాడలూ కనబడ్తున్నాయి.

☆ ☆ ☆